ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి-హుకుంపేట: ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు స్థానిక ఎస్సై బి.సతీష్ తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణం నేపథ్యంలో వాహనాలు రాకపోకలకు రద్దీ పెరిగిందిని అయన తెలిపారు. గురువారం మండల కేంద్రలోని రాళ్ల గెడ్డ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

రోడ్డు షోలు, ర్యాలీల నిషేధం తగదు

- జిఒ 1ను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం
- అరకులోయలో నిరసన

ప్రజాశక్తి-అరకులోయరూరల్: రాష్ట్రంలో రోడ్డు షోలు, ర్యాలీలపై నిషేధం విధించడం తగదని, ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జిఓ 1ను రద్దు చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలకు అనుమతి ఇచ్చి, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అరకులోయ మెయిన్ రోడ్డు వద్ద సీపీఎం అల్లూరి జిల్లా కమిటి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, అర్థాంరంగా జగన్ మోహన్ రెడ్డి జీఓ 1 తీసుకొచ్చి ఆంధ్ర రాష్ట్రాన్ని చీకటి రోజులు తెస్తున్నారని, ఇది దుర్మార్గమన్నారు. ప్రతీ ప్రతిపక్షంలో జగన్మోహన్ రెడ్డి నాయకుడుగా ఉన్నప్పుడు అన్ని ప్రాంతాల్లో రోడ్డులపై బహిరంగ సభలు, పాదయాత్రలు చేశారని, అప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. జీఓ తీసుకొచ్చి ప్రతీ పక్షాలు గొంతునొక్కే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షం నాయకులను, ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు, రోడ్డుపై అరెస్టులు చేసి, నిర్బందించే చేసే కార్యక్రమం చేస్తున్నారని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న లోకనాథం

జిఒ 1 కాపీలను దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస మాట్లాడుతూ, వైసీపీ చీకటి జిఓ తీసుకొచ్చి ప్రజా ఉద్యమాలను అణిచివేయడనికి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. రాబోయే 2024 ఎన్నికల్లో ప్రజలు ఓడిస్తారని తెలిసి ఇలాంటి దుర్మార్గమైన జిఓలతో ఆంక్షలు పెడుతున్నారన్నారు. ఏజెన్సీలో ఇప్పటికీ జీవో 3 రద్దు చేసి గిరిజన యువతకు మోసం చేశారని విమర్శించారు. 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రైవేటు వ్యక్తులకు హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో గిరిజన సంపదను అక్రమ మార్గంలో దోచుకోవడానికి ఇలాంటి చీకటి జిఓలు తెస్తున్నారని విమర్శించారు. ముందుగా జిఒ 1 కాపీలను నాయకులు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటి సభ్యులు కిల్లో సురేంద్ర, అనంతగిరి జడ్పీటీసీ డి. గంగరాజు, నాయకులు వి.ఉమామహేశ్వరవు, బాలదేవ్, రామారావు, పోతురాజు, సుందర్‌రావు, సూరిబాబు, పృద్విరాజ్, సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీవో 1 జారీ దుర్మార్గం

ముంచింగిపుట్టు: జీవో 1ని రద్దు చేయాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిలో బలరాం ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్ళకు నల్ల రుబ్బన్‌లు కట్టుకుని మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్ షో, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించకుండా అడ్డుకోవడం కోసం ప్రత్యేక జీవోలు తేవడం దుర్మార్గమ న్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలే వైసిపి ప్రభుత్వాన్ని బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.జగత్రాయ్, రాష్ట్ర ఎస్టి సెల్ ప్రధాన కార్యదర్శి జి.రామమూర్తి, పార్టీ మహిళా ఉపాధ్యాలు కె.సన్యాసమ్మ, బాబూజీ, వనపసింగి సర్పంచ్ వి.లక్ష్మణ్, కె.కేశ్వరావు, ఆర్ కొండలరావు, వి.చిన్ని, సింహచలం, గోపాల్, లైకోన్ పాల్గొన్నారు.

పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

ప్రజాశక్తి-చింతూరు

మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. పోలీసు ఇన్‌ఫార్మర్ నెపంతో చింతూరు మండలంలోని చిడుమూరు గ్రామపంచాయతీ పరిధి బుర్కానుకోట గామానికి చెందిన సోయం సుబ్బయ్య (50) అనే గిరిజనుడిని హత్య చేశారు. మావోయిస్టులు బుధవారం రాత్రి సుబ్బయ్యను హత్య చేసి రోడ్డుపై పడేశారు. ఈ ఘటన గురువారం వెలుగు చూసింది. ఘటన స్థలంలో మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, సుకుమా జిల్లా, కుంట ఏరియా కమిటీ పేరున ఒక లేఖను వదిలివెళ్లారు. సుబ్బయ్య పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా ఉంటూ అనేక మంది హత్యకు, బూటకపు ఎన్‌కౌంటర్లకు కారణమైనందున ఆయనకు తాము ఈ శిక్ష విధించామని ఆ లేఖలో పేర్కొన్నారు. గతంలో అనేకసార్లు సుబ్బయ్యను హెచ్చరించినా వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ఈ ఘటనతో బుర్కానుకోట, జివ్విగూడం గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చత్తీస్‌ఘడ్-ఆంధ్ర సరిహద్దులో ఉన్న ఈ గ్రామాల్లో గతంలో కూడా మావోయిస్టులు గిరిజనులను కిడ్నాప్ చేసి అనంతరం హత్య చేసిన ఘటనలు ఉన్నాయి. విషయం తెలుసుకున్న చింతూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు.

యుసిఐఎం చర్చి వద్ద విద్యార్థులతో జర్మనీ దేశస్తులు

గిరిజన గ్రామాల్లో విదేశీయుల సందడి

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు రాస బేడ గిరిజన గ్రామాల్లో జన్మనీ దేశస్తులు సందడి చేశారు. నికాయిల్‌తో కూడిన 14 మంది జర్మనీయులు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గ్రామాల్లో విస్తతంగా పర్యటించారు. ఇక్కడి గిరిజన ఆచార సంప్రదాయాలను తిలకించారు. రాసబేడ గ్రామానికి విదేశీయులు చేరుకోగానే గిరిజనులు వారి ఆచార సంప్రదాయాలతో పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. వారితో కాసేపు ముచ్చటించి వారి ఆచారాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ముందుగా రాజమండ్రి నుంచి వస్తు పోల్లూరు చేరుకొని క్రైస్తవ సంఘస్తులతో సమావేశమై బీద ప్రజల స్థితిగతులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సీలేరు యుసిఐఎం చర్చి వద్దకు వారు చేరుకోగానే యూసీఐఎం హాస్టల్ విద్యార్థులు అపూర్వ స్వాగతం పలికారు. విశ్రాంతి భవనంలో బిస్సప్ డాక్టర్ కేర్ సింగ్‌తో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ మనసై తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో పొరపాట్లు సరిదిద్దుకోండి

- విధుల పట్ల బిఎల్‌ఒలు శ్రద్ధ చూపాలి
- ఓటరు నమోదు పరిశీలకులు బాబు
- పోలింగ్ కేంద్రాలు, జాబితాలపై ఆరా

ప్రజాశక్తి-పాడేరు: ఓటరు నమోదు ప్రక్రియలో పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని, తక్కువ ఇపి రేషియో (ఓటరు, జనాభా నిష్పత్తి) ఉన్న ప్రాంతాలలో కారణాలు విశ్లేశించాలని ఓటరు నమోదు పరిశీలకులు ఎ.బాబు కోరారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌తో కలిసి ఓటరు నమోదు అధికారులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులలో ఉన్నత స్థాయిలో సిఇఓ నుండి క్రింది స్థాయి బిఎల్ఓ వరకు ఎన్నికల నిభందనల మేరకే పని చేయాలని సూచించారు. గత రెండు సమావేశాలలో పనుల పురోగతిపై పలు సూచనలు అందజేయడం జరిగిందని. ఆశించినంతగా లేదన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియగా సాగాలని, కొంతమంది బిఎల్ఓ.లు ఇది తమ పని కాదనుకుంటున్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా చేసిన తొలగింపులు, చేర్పులు తదితర వివరాలను నియోజకవర్గాల వారీగా పరిశీలకులు సమీక్షించారు. అధికంగా తొలగింపులు, చేర్పులు చేసిన బూత్‌ల్లో ఓటర్ల నిష్పత్తి చూడాలని అబ్జర్వర్ చెప్పారు. తిరస్కరించిన ఫారం-6లు, ఆధార్ ఫోటో అప్ డేషన్లపై వివరాలను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓల పనుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బిఎల్ఓలు పనుల పురోగతి సంతృప్తి కరంగా లేదని మరింత ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. కొత్తగా నమోదైన వారందరికీ ఎపిక్ కార్డులు అందజేయాలని సూచించారు. పట్టభద్రుల నియోజక వర్గానికి సంబంధించి 13 పోలింగ్ స్టేషన్ల జాబితాలు ఆయా కేంద్రాలకు సరఫరా చేసిందీ లేనిదీ ఆరా తీసారు. అనర్హత, డూప్లికేషన్, అండర్ క్వాలిఫికేషన్ అంశాలపై ఆరా తీసారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్‌కు కలెక్టర్ వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ, డ్రాఫ్ట్ పబ్లికేషన్ నాటికి 7,15,707 మంది ఓటర్లు నమోదు కాగా, ప్రస్తుతం తుది జాబితా ప్రచురణ నాటికి 13,096 మంది పెరిగి 7,28,803 మందికి చేరిందని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు రోణంకి గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, సబ్ కలెక్టర్లు వి.అభిషేక్, శుభం బన్సాల్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ బి.దయానిధి, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఓటరు నమోదు పరిశీలకులు బాబు

సిఐటియు రాష్ట్ర కమిటీలో

అల్లూరి జిల్లా నేతలకు చోటు

ప్రజాశక్తి -పాడేరు: సీఐటీయూ రాష్ట్ర కమిటీకి అల్లూరి జిల్లా పాడేరు నుంచి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్‌కి చిన్నయ్య పడాల్ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 2నుండి4 వరకు రాష్ట్ర మహాసభలు జరిగాయి. అల్లూరి జిల్లా పాడేరు నుంచి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్యపడాల్ రాష్ట్ర కౌన్సిల్‌కి ఎన్నికయ్యారు, వి.ఉమా మహేశ్వరరావుని రాష్ట్ర కమిటీకి ఎన్నుకున్నారు. ఆశ వర్కర్ల సంఘం నుంచి రాష్ట్ర కౌన్సిల్‌కు వై.మంగమ్మను ఎన్నుకున్నారు. నూతనంగా ఏర్పడిన అల్లూరి జిల్లా నుంచి రాష్ట్ర కమిటీ కౌన్సిల్‌కి ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమన్నారు. జిల్లాలో కార్మిక వర్గసమస్యల పై ఉద్యమిస్తామని తెలిపారు. రాష్ట్ర కమిటీకి వీరు ఎన్నిక కావడం పట్ల జిల్లాలోని సిఐటియు శ్రేణులు, కార్మిక వర్గాలు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికైన పడాల్, ఉమామహేశ్వరరావు

సమావేశంలో మాట్లాడుతున్న నానిబాబు

ఉద్యోగ నియామకాల్లో గిరిజనులకు అన్యాయం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామకాలలో స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేయకపోతే ఐటిడిఎను ముట్టడిస్తామని గిరిజన విద్యార్థి సంఘం (జిఎస్‌యు) నాయకుడు వెచ్చంగి నానిబాబు హెచ్చరించారు. అల్లూరి జిల్లాలో జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిఎస్‌యు భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలన్ని 100శాతం స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలన్న రిజర్వేషన్‌కు సంబంధించిన జిఓ-3 రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ పెండింగ్ లో ఉన్నప్పటికీ జిల్లాలో జల వనరుల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేయడం సరికాదన్నారు. ఇటీవల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఉద్యోగ నియామకల్లోనూ 98 పోస్టులకు గానూ, 26 పోస్టులు మాత్రమే గిరిజనులతో భర్తీ చేసి మిగతా పోస్టులన్నీ గిరిజనేరేతులతో భర్తీ చేశారని తెలిపారు. ప్రస్తుతం ఇరిగేషన్ శాఖలో ఉద్యోగాలు భర్తీకి కలెక్టర్ జారీ చేసిన నోటిఫికేషన్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం 6 శాతం మాత్రమే గిరిజనులకు రిజర్వేషన్ కల్పించి, మిగిలిన 94 శాతం ఉద్యోగాలను గిరిజనేతరులకు కేటాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వెంకటరావు, సూరిబాబు, కామరాజు, డేవిడ్ రాజు, ఉదయ్, రామకృష్ణ, ప్రసాద్, దేవదాస్, యేసుదాసు, దానియల్, సాంబ, ప్రవీణ్, దిలీప్, మధు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును అడ్డగించడంపై టిడిపి నిరసన

ప్రజాశక్తి - రంపచోడవరం

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంపై టిడిపి శ్రేణులు గురువారం నిరసన తెలిపాయి. మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన స్థానిక క్యాంప్ ఆఫీస్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మూడు రోడ్ల కూడలిలో నిరసన తెలిపారు. రోడ్లపై ర్యాలీలు, రోడ్ షోలు, సభలు నిర్వహించకూడదని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన చీకటి జిఓ 1ను రద్దు చేయాలని కోరుతూ ఆ జిఓ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటిష్ వారు రూపొందించిన జీవోను నేటి వైసిపి ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో నాటి టిడిపి ప్రభుత్వం పూర్తిగా భద్రత కల్పించిందని, నేడు అందుకు విరుద్ధంగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల టిడిపి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి, టిడిపి కార్యకర్తలు

చింతూరు : చంద్రబాబును అడ్డుకోవడంపై మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో నెంబర్ వన్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇళ్ల చిన్నారెడ్డి, మల్లెల వెంకటేశ్వరరావు, జి.సురేష్, శ్రీలం తమ్మయ్య, ఆకోజ్ నూకచారి, తుర్రం ముత్తయ్య, శ్రీరామ్మూర్తి రెడ్డి, పొదిలి రామారావు, సాల్మన్ రాజు, కట్ట శంకర్, తుర్రం బాబురావు, కుంజ బాలకృష్ణ పాల్గొన్నారు.

ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-చింతూరు

కేరళలోని త్రివేండ్రంలో ఈనెల 6 నుండి 9వ తేదీ వరకు జరుగుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఐద్వా జెండాను సీనియర్ నాయకులు పత్రా లక్ష్మి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షులు మల్లం సుబ్బమ్మ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి ప్రధాన లక్ష్యాలుగా 1981లో ఐద్వా ఏర్పడినట్లు చెప్పారు. నాటి నుండి మహిళలపై జరుగుతున్న దాడులు, హింసకు వ్యతిరేకంగా మహిళలను ఐక్యం చేసి పోరాటాలు చేస్తోందని తెలిపారు. మహిళల అక్షరాస్యత పెంపుదలకు, ఉపాధి అవకాశాలు కోసం ఐద్వా నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నాయని, వారిని గృహిణిగా ఇంటికి మాత్రమే పరిమితం చేయాలని కుట్రతో రాజకీయ సామాజిక అవగాహన కల్పించేందుకు శ్రద్ధ పెట్టడం లేదని విమర్శించారు. మద్యపాన నిషేధం, చట్ట సభల్లో 50శాతం రిజర్వేషన్, మహిళా చట్టాలను పటిష్టంగా అమలు పరచడం, పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించడం, తదితర అంశాలు ఎన్నికల వాగ్దానాలుగా మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలో జరిగే ఐద్వా ఆలిండియా మహాసభలు మహిళలకు సంపూర్ణ స్వరాజ్యం సాధించే దిశగా తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విజయలక్ష్మి మాసాబత్తుల మంగ తాయారు, పత్రా నాంచారి, జయ, గంటల పార్వతి, సవలం రాజమ్మ, ఉదయం సాయమ్మ, కడియం రాజమ్మ, కారం లక్ష్మి, కణితి స్వర్ణ, పత్రా లక్ష్మి, పేరుమల సత్యవతి పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి పంచాయతీ పరిధి రాజవొమ్మంగి, అప్పలరాజుపేట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడిఈ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజవొమ్మంగి విద్యుత్ సబ్ స్టేసన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలపై తీగలపై ఉన్న చెట్లను తొలగించడం, సబ్ స్టేషన్ మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటలు నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

'ఉమెన్ రిప్రజెంటేషన్ ఇన్ ఇండియా' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -సీలేరు

భారతదేశంలో మహిళల హక్కులు, రిజర్వేషన్లు, రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం తదితర అంశాలతో ఏపీ జెన్కో ఈఈ లక్ష్మీనారాయణ, ఏఈ డాక్టర్ ఎన్.శంకర్రావు, ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాసరావు రచించిన 'ఉమెన్ రిప్రజెంటేషన్ ఇన్ ఇండియా' అనే పుస్తకాన్ని రచయితల్లో ఒకరైన లక్ష్మీనారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయితలు మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారని, ముఖ్యంగా విద్య, వైద్యం, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బహుముఖ పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. భారత దేశంలో స్త్రీలు జనరల్ ఎన్నికల్లో 1952లో 2.3 శాతం మంది పాల్గొనగా, 1999లో 6.5 శాతం, 2009లో 10.8శాతం మంది, 2019లో 13.47 శాతం మంది పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్స్ 14, 15, 16, 243-(డి)2, 243(డి)3లో స్త్రీలకు సంబంధించిన హక్కుల గురించి పొందిపర్చినట్లు చెప్పారు. భారతదేశంలో స్త్రీలను తల్లిగా, చెల్లిగా, అక్కగా, దేవతగా గౌరవిస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో స్త్రీలు అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఈఈ జాకీర్ హుస్సేన్, ఏడిఈ క్రాంతి, ఎ.శ్రీనివాసరావు, ఏఈలు రమేష్, అప్పలనాయుడు, కిరణ్, శిరోమణి, మట్టయ్య, సురేష్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - రంపచోడవరం

అర్హత కలిగిన వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలం ముసురుమిల్లి సచివాలయం పరిధిలోని చిన్న భారంగి, బోర్నగూడెం, ఇర్లపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో గురువారం ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో పథకాలన్నీ మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

బొండాపల్లి సర్పంచ్ ఔదార్యం

సొంత నిధులతో చదరం గ్రామానికి తాగునీటి సౌకర్యం

రూ.2.50 లక్షలు వెచ్చించి గ్రావిటీ పథకం ఏర్పాటు

అపర భగీరథయత్నంతో నీటి సదుపాయం : జనం హర్షం

గ్రావిటీ పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మత్స్యరాజు

ప్రజాశక్తి-పెదబయలు రూరల్ : పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ సర్పంచ్ బసుదొర మత్స్యరాజు ఔదార్యాన్ని చాటుకున్నారు. పంచాయతీ పరిధిలోని చదరం గ్రామంలో ప్రజలు గత కొన్నేళ్లుగా తాగునీటి కొరతతో గొంతెండి అల్లాడుతున్నా, అధికారులు నేతలు, పట్టించుకోకపోవడంతో తన సొంత నిధులు రూ.2.50 లక్షలతో గ్రావిటీ పథకాన్ని నిర్మించి గ్రామస్తుల గొంతు తడిపారు. సర్పంచ్ చొరవ, కృషికి గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

బసుదొర మత్స్యరాజు బొండాపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన నాటినుంచి చదరం గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని జిల్లాకలెక్టర్‌తోపాటు మండలస్థాయి అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నారు ఎన్నిసార్లు విన్నవించినా ఏ ఒక్కరి నుంచి స్పందన లేకపోవడం, మరోవైపు పంచాయతీకి ఎటువంటి నిధుల లభ్యత లేకపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లోతాను స్వచ్ఛందంగా ముందుకొచ్చి తన సొంత నిధులు రూ.2.50లక్షలను వెచ్చించి, చదరం గ్రామానికి సుమారుగా రెండు కిలోమీటర్లు దూరాన ఉన్న కొండపైనుంచి గ్రావిటీ పద్ధతిన పైపులైన్ ఏర్పాటు చేసి, నీటినినేరుగా గ్రామానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ట్యాంకర్‌ను నింపి, ప్రజలకు తాగునీరు అందించే ఏర్పాట్లు చేశారు. సొంత నిధులతో అపర భగీరథ యత్నంతో ప్రజల దాహార్తిని తీర్చిన సర్పంచ్ చొరవ, కృషికి గ్రామస్తులు అభినందిస్తున్నారు. గురువారం పథకాన్ని ప్రారంభించి, గ్రామస్తులకు అప్పగించడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయం సిబ్బంది నాగబాబు, విఆర్‌ఒ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, వార్డ్ సభ్యుడు నారాయణ, గ్రామ వాలంటీర్ వసంత కుమారి పాల్గొన్నారు.

బలియగుడలో పశువైద్యశిబిరం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ భాస్కరరావు, పశు వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని బలియగుడ పంచాయతీ కేంద్రంలో పశువైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఈ నెల 3న ఆవు చనిపోవడంపై అంతు చిక్కని వ్యాధితో పశువుల మృత్యువాతపై ప్రజాశక్తిలో వెలువడిన కథనానికి వెటర్నరీ డాక్టర్ స్పందించి, గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి, ఆవు మృత్యువాతపై విచారించారు. చనిపోయిన ఆవు నీరసించిపోవడం వల్లే ఆవు మృత్యువాత పడినట్లు నిర్ధారించారు. మిగిలిన పశువులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలో అన్ని పశువులకు లంపి స్కిన్ వ్యాధికి వ్యాక్సినేషన్ ఇదివరకే చేయించామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రెండు పశువులను పరీక్షించి, పొట్ట పురుగులు వల్లే అవి అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అయినప్పటికీ సంబంధిత పశువుల పేడను సమీకరించి, విశ్లేషణకు అరుకులోని వ్యాధినిర్ధారణ కేంద్రానికి పంపుతున్నట్లు వెల్లడించారు. దూడలకు డీవార్మింగ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ, రామునాయుడు ,సిబ్బంది పాల్గొన్నారు.

'నాడు - నేడు' నిధులు దుర్వినియోగమైతే చర్యలు

పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ ప్రకాశరావు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం వహించిన, నిధులు దుర్వినియోగమైనా సహించేది లేదని పిఎంయు ఎస్ఇ కుంచజనన ప్రకాశరావు హెచ్చరించారు. గురువారం ముంచంగిపుట్టు మండలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి పనులను పరిశీలించారు. మండలంలోని దారపల్లి, కరిముక్కిపుట్, నందిమెట్ట, చెరువు పాకలు, పెదగూడ, కిలగాడ కెజిబివి పాఠశాల, కోడపుట్-బి పాఠశాలలను సందర్శించారు. నాడు-నేడు రెండో విడత నిధుల వినియోగానికి సంబంధించిన సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం విధిస్తున్న చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.. పనుల పురోగతిపై ఆయా హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనుల్లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను ఎలా అధిగమించాలో హెచ్‌ఎంలకు వివరించారు. ప్రస్తుతం సిమెంట్ కొరతతో ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని హెచ్‌ఎంలు ఎస్ఇకి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో నాడు నేడు నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేపట్టాలని హెచ్‌ఎంలకు సూచించారు. తనిఖీల్లో ఎంఇఒ చెల్లయ్య, సిఆర్‌పిలు ఎస్. గౌరీశంకర్, సురేష్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యా కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పింఛన్లు పంపిణీ చేస్తున్న పిఎసిఎస్ అధ్యక్షుడు

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని ఆడాకుల సచివాలయంలో పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పిఎసిఎస్ అధ్యక్షుడు అప్పన గజ్జయ్య దొర, సచివాలయ కన్వీనర్ అప్పన జయంతి గురువారం పింఛన్ సొమ్మును అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం దశలవారీగా పింఛను మొత్తాన్ని పెంచుతూ, ఇపుడు ఒక్కో లబ్ధిదారునికి నెలకు రూ.2,750 అందజేస్తున్నారని, వచ్చే ఏడాదికి దాన్ని రూ.మూడు వేలు చేయనున్నారన్నారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక పెన్షన్లు అందిస్తున్న ప్రభుత్వం వైసిపియేనన్నారు. కార్యక్రమంలో ఆడాకుల గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు వద్దు!

సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య

చిట్టివలస గ్రామసభలో ఏకగ్రీవ తీర్మానం

చిట్టివలస గ్రామసభలో తీర్మానం ప్రవేశపెడుతున్న సిపిఎం సర్పంచ్ మొస్య

ప్రజాశక్తి -అనంతగిరి : 1/70, పీసా వంటి చట్టాలను తుంగలో తొక్కి, పర్యావరణానికి, గిరిజనానికి నష్టం కలిగించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్ష నిర్ణయంతో చేపట్టబోయే చిట్టవలస వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో జరగనివ్వబోమని సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య స్పష్టం చేశారు. గురవారం టోకూరు పంచాయతీ, శశి వలయ కేంద్రంలో సర్పంచ్ కిల్లో మొస్య అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో చిట్టంవలస హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు.

ఈ సందర్భంగా మొస్య మాట్లాడుతూ, హైడ్రో వపర్ ప్రాజెక్టు వల్ల మన్యానికి, గిరిజనానికి వాటిల్లే నష్టాలను వివరించారు. పంచాయతీ సభ్యులు, ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తూ ఏకగ్రీవం తీర్మానం చేసినట్లు వెల్లడించారు పెద్దకోట, పిన్నకోట పంచాయతీల పరిధిలోని రేగులపాలెం, కుడియా, కొండేపకోట, గుజిరి, అలాగే గుమ్మకోట పంచాయతీ పరిధి గుజ్జిలలోనూ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా పంచాయతీ గ్రామసభల్లో ఆమోదించి, తీర్మానాలు చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనుల జనావాసాలు, పంటపొలాలతోపాటు అడవులు, తాగునీటి వనరులకు నష్టం కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గ్రామాలను సందర్శించి, గిరిజనానికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిపై చైతన్యవంతులైన పెద్దకోట, రేగులపాలం ప్రజలు తమ గ్రామాల్లో ప్రాజెక్టు భూముల సర్వేకు వచ్చిన అధికారుల బృందాన్ని అడ్డుకుని తిప్పిపంపడమే కాకుండా, మళ్లీ వస్తే తరిమికొడతామని హెచ్చరించారన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన గ్రామాలు, పంచాయతీల్లోనూ హైడ్రోవపర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మండల, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో దీనిపై చర్చ జరిగి, హైడ్రోవపర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీర్మానాలు చేసి, ఆమోదించేలా ఒత్తిడి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జి.నరసన్న పంచాయతీ సెక్రటరీ లావణ్య, విఆర్‌ఒ రామన్న సిపిఎం మండల నాయకులు జి. దేవన్న, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

గిరిజనం సమస్యలు పట్టవా..?

- నిలువునీడ లేక పర్యాటకుల అవస్థలు
- కనీస సౌకర్యాల్లేక మన్యవాసుల అగచాట్లు
- వైసిపి ప్రభుత్వ సంక్షేమం మాటల్లోనే...
- సిపిఎం జిల్లా నేత మట్ల వాణిశ్రీ

నిరుపయోగంగా ఉన్న బస్‌కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న సిపిఎం నేత వాణిశ్రీ

ప్రజాశక్తి -మారేడుమిల్లి : సవాలక్ష సమస్యలతో మన్యవాసులు అవస్థలు పడుతున్నా సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి సర్కారుకు పట్టడం లేదని సిపిఎం, గిరిజన సంఘం నేతలు మండిపడుతున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన మారేడుమిల్లిలో బస్‌షెల్టర్ లేక స్థానికులు, ప్రయాణికులతోపాటు ఈ ప్రాంత సందర్శనకు వచ్చే పర్యాటకులు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణమే పాత బస్‌స్టాండ్‌ను పునరుద్ధరించి, వినియోగంలోకి తేవాలని కోరారు. ఈమేరకు గురువారం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలోఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల.వాణిశ్రీ మాట్లాడుతూ, మండల కేంద్రంలోవాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల వాటిని రోడ్డుపైనే నిలపాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రయాణికులు సైతం బస్సుల కోసం ఎండావానల్లో రోడ్డుపైనే నిరీక్షించాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. మారేడుమిల్లిలో ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ అక్కడకు వాహనాలు వెళ్లకపోవడంతో పదేళ్లుగా నిరుపయోగంగా ఉందన్నారు. వివిధ కేసుల్లో పోలీసులు సీజన్ చేసిన వాహనాల డంపింగ్ ప్రాంతంగా ఇది మారిపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని మండిపడ్డారు. తక్షణమే ఆర్‌టిసి బస్‌స్టాండ్‌లో ఉన్న వాహనాలను బయటకు తీసి, బస్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజల కష్టాలకు విముక్తి కల్పించాలని వాణిశ్రీ డిమాండ్ చేశారు. దాన్ని పునరుద్ధరించలేని పరిస్థితుల్లో కొత్త బస్‌స్టాండ్‌ను నిర్మించి, ప్రయాణికులు రోడ్డుపైనే వేచియుండే దౌర్భాగ్య పరిస్థితి నుంచి విముక్తి కల్పించి, నిలువనీడ ఏర్పాటు చేయాలని కోరారు.ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టకుంటే ప్రజలను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మండలంలో తాగునీరు, రహదారులు, విద్య, వైద్యం ఇలా అన్ని విభాగాల్లో సమస్యలు తిష్టవేసి ఉన్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమ పేరుతో వైసిపి ప్రభుత్వం పైపై మెరుగులు దిద్దుతుందే తప్ప ప్రజాసమస్యల పరిష్కారానికి గానీ, శాశ్వత సౌకర్యాల కల్పనకుగానీ కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి, గిరిజన యువత పాల్గొన్నారు.

ప్రజా సేవకు ఎల్లవేళలా సిద్ధం

గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎస్ఐ రవీంద్ర

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: అసాంఘిక కార్యకలాపాలకు గిరిజన యువత దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని స్థానిక ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు. గురువారం మండలంలోని మారుమూల బాబుశాల పంచాయతీ గాజులబంధ, బల్లుగూడ గ్రామాల్లో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలతో మమేకమై, వారితో ముచ్చటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, నాటుసారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ కె.రవీంద్ర మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేకమైన గంజాయి సాగు, రవాణా జోలికి పోవద్దని, తద్వారా భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. పోలీసులంటే భయాన్ని వీడాలని, ప్రజలకు సేవ చేసేందుకు పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసుల దృష్టికి తెస్తే, తమ శాఖ పరిధిలోని సమస్యను పరిష్కరించడంతోపాటు మిగతా శాఖల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది, గాజులబంద, బల్లుగూడ గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల సేవలు

రగ్గులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం మండలం ఒడియా క్యాంప్, ఇంతులూరువాగు గిరిజన గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో ఐటిసి పరిధిలో వైడిఒ మాతృభూమి సేవా సంఘం, ఎస్‌పి యూత్ సొసైటీ ఆధ్వర్యంలో 150మంది గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్తిబాబు మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా పోలీస్‌శాఖల వారధిగా స్వచ్ఛంద సంస్థలు పనిచేసి గిరిజన ప్రాంతంలో ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించడం, వాటిని పోలీస్ శాఖతో చేయించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైడిఒ సిఇఒ కృష్ణ మాట్లాడుతూ తమతో కలిసి గిరిజన ప్రాంతంలో సేవా కార్యక్రమాల నిర్వహణకు మాతృభూమి సేవా సంఘం, ఎస్‌పి యూత్ సొసైటీ కలిసిరావడంపై ఆనందం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో గత కొన్నేళ్లుగా మాతృభూమి సేవా సంస్థ ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల నిర్వహణతోపాటు రగ్గులు పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని, అటువంటి సంస్థ తాము చేసే సేవల్లో భాగస్వామ్యం కావడంపై హర్షం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఎస్‌పి యూత్ సొసైటీ అధ్యక్షురాలు ప్రవళ్లిక, సభ్యులు శ్రీను పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

పజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతీ గిరిజన కుటుంబానికి ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. ఐటిడిఎ కార్యాలయం గాం గంటందొర వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి 11 మండలాల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపిడిఒలు, ఉపాధిహామీ అధికారులు, ఎటిడబ్ల్యూఒలు, ఎంఇఒలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్ కార్డులు కలిగి ఉండి పనులు కల్పించని గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు కల్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులు, మిషన్ కనెక్ట్ పాడేరు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, మనబడి నాడు-నేడు పనులు, అంగన్వాడీ భవన నిర్మాణాలు, జల జీవన్ మిషన్ పనులపై సమీక్షించారు. జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో చేపట్టిన మన బడి నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక ప్రాంతాలలో మునగ మొక్కలు నాటాలని సూచించారు. తాగు నీటి సమస్య తలెత్తకుండా జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయడానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జాజులపాలెం అంజలి - శనివారం, గుల్లేలు - ఖంద్రూం, చిరుపల్లి సీలేరు రోడ్ల పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసు కున్నారు. పర్యాటక ప్రాంతాలలో పారిశుద్ధ్యంపై ఎంపిడిఒలు దృష్టి పెట్టాలని సూచించారు. పెదబయలు మండలం దిగువ కుమడలో 30 మంది పిల్లలు ఆధార్ కార్డులు లేక పాఠశాలలకు రాలేదని, నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రాలలో ఉన్న ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్సుల అద్దెలు వసూళ్ల చేయాలని, గిరిజనేతరులు ఉంటే తొలగించాలని ఎంపిడిఒలకు సూచించారు. పంచాయతీలలో పారిశుద్ధ్యం, పన్నులు వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసారు. ఉపాధి హామీ కూలీలకు ప్రధాన మంత్రి సురక్షా యోజనలో బీమా చేయించాలన్నారు. భవన నిర్మాణాలకు తీసిన గోతులలో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఇఒ పి.రమేష్, టిడబ్ల్యు ఇఇలు డివిఆర్ ఎం.రాజు, ఆర్‌అండ్‌బి ఇఇ బాలసుందర బాబు, పిఆర్ ఇఇ టి.కొండయ్యపడాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ లీలాకృష్ణ, డిఇ ప్రకాష్, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, ఎంఇఒ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పింఛన్ల రద్దు దుర్మార్గం

గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్

ప్రజాశక్తి- పెడబయలు : పింఛనే జీవనాధారంగా ఉన్న నిరుపేద, అనాథ గిరిజన లబ్ధిదారులు పెన్షన్లు లేనిపోని కారణాలు చూపుతూ రద్దు చేయడం దుర్మార్గమని గిరిజన సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మ పధ్వీరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలో గోమంగి పంచాయతీ సరియపల్లి గ్రామానికి చెందిన రుంజాలి మత్యలింగం, రుస్జాలి చిట్టిబాబు, కొమ్మ రాములమ్మ, కొమ్మ లక్ష్మీ నలుగురి వృద్ధాప్య పింఛన్లను ప్రభుత్వం రద్దు చేసిందన్న సమాచారంతో బాధిత లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. అన్ని విధాలా అర్హులైనప్పటికీ, వారి పింఛను రద్దు చేశారని, ఎందుకు పింఛను రద్దు చేస్తున్నారో కూడా వారికి సంబంధిత సమాచారం ఇవ్వలేదని బాధితులు చెబుతున్నారన్నారు. నిరక్షరాస్యులైన అమాయక గిరిజనులకు నోటీసులిస్తే సమాచారం వారికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. రెక్కాడితేగానీ డొక్క నిండకపోవడంతోపాటు ఇతరులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వీరికి పింఛను రద్దు చేయడం సరికాదని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 50 ఇళ్లకు ఒక వాలంటీరును నియమించారని, పింఛను లబ్ధిదారుల స్థితిగతులు వారికి తెలియవా అని ప్రశ్నించారు. తక్షణమే బాధితులకు పింఛను నిలిపేయకుండా కొనసాగించాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళన తప్పదని హెచ్చరించారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: నెలసరి కనీస వేతనం రూ.26వేలు అమలు, ఉద్యోగ భద్రత కల్పన, ఇఎస్ఐ, పిఎఫ్, బీమాతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పన, ఇతర సమస్యల పరిష్కారానికి స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకరరావు మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చిన సిఎం జగన్, ఇపుడు వాటిని అమలు చేయక మోసగించడం దుర్మార్గమన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి, అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అధికారులు, రాజకీయ నేతల వేధింపులను అరికట్టడంతోపాటు పనిభారాన్ని తగ్గించాలని, ఆన్‌లైన్ అటెండెన్స్,ఫేసియల్ రికగ్నిజేషన్ హాజరు నుంచి మినహాయించాలని కోరారు. గ్యాస్, కూరగాయల బిల్లులతోపాటు భవనం అద్దె, సకాలంలో చెల్లించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలని కోరారు. దీనిపై స్పందించకుంటే మండల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. లక్ష్మీపురం సర్పంచ్ కే త్రినాథ్, డొంబ్రు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విద్యార్థుల మరణాలు

ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుల ధ్వజం

18వ రోజు కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: అధికారుల తీరుతోనే వరుసగా గిరిజన విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. ఐటీడీఏ గేట్ ముందు కొనసాగుతున్న. రిలే నిరాహార దీక్షలు గురువారం 18వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలను ఉద్దేశించి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కూడా రాధాకృష్ణ మాట్లాడుతూ, బుధవారం నిర్వహించిన మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేసిన ప్రజా సంఘాల నాయకులకు పలు కళాశాలల విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు .18 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించేంత వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు.గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు తక్షణమే హెల్త్ అసిస్టెంట్ ఆశ్రమంలో నియ మించాలన్నారు. ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక నాయకులు కంబిడి లత కుమారి, స్వరూప, ముువ్వల లక్ష్మణరావు, చిన్నారావు, చంటిబాబు, బత్తిరి నరేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-హుకుంపేట : ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు మండలంలోని గత్తుం పంచాయతీ పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన గడపగడప కార్యక్రమలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వైయస్సార్ పెన్షన్ కానుక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన పెన్షన్ దారులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని 335 మందికి నూతనంగా పెన్షన్‌లు మంజూరైందని తెలిపారు. అర్హులు ఎవరైనా ఉంటే నేరుగా సచివాలయంలోని దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకట్రావు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు ముత్యాంగి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీలు కే.నాగరాజు, భీమలింగేశ్వరరావు, సర్పంచులు సాంబ, సత్యవతి, పద్మ పాల్గొన్నారు

రాష్ట్రంలో తుగ్లక్ పాలన : మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి -సీలేరు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తున్నారని టిడిపి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జీకే వీధి మండలం, దారకొండ, కొంగపాకలు పంచాయతీల పరిధిలోని నేలజర్త, రాళ్లగెడ్డ గ్రామాల్లో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని గురువారం ఆమె చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఒక్క ఛాన్స్, ఒక్క ఛాన్స్ అంటూ, జగన్ కావాలి జగన్ రావాలి అని ప్రజల్ని భ్రమల్లో పెట్టి గెలిచాక వారిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. జగన్‌కు ఎందుకు ఓట్లు వేశామా? అని అన్ని వర్గాల ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఇటీవల గడపగడపకు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని గిరిజనులు నిలదీశారని, గ్రామాలకు రావొద్దని తిరగబడ్డారని గుర్తు చేశారు. టిడిపి హయాంలో దారకొండ పంచాయతీ గుమ్మి రేవుల వరకు సుమారు రూ.20 కోట్లతో 20 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహేష్, గోవిందు, మన్మధరావు, పోతురాజు, సరస్వతిరావు, తిరుమల రావు, బొర్రా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.